## క్లుప్తంగా

### ప్రశాంతంగా డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలు

విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటలకు 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. ఇందుకు 139 మంది దరఖాస్తు చేసుకోగా 120 మంది ఎంట్రెన్స్ పరీక్షకు హాజరయ్యారు. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగింది. ఇందులో 139 మంది దరఖాస్తు చేసుకోగా 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ దారా మేరి మంజుల, అబ్జర్వర్ నాగేశ్వరమ్మలు పర్యవేక్షించారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన పిన్నెల్లి



విజయపురిసౌత్: స్థానిక సి టైప్ నందు నివసిస్తున్న పగిడిమారి కుమార్‌బాబు(టింకు) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 12న మృతి చెందాడు. మాచర్ల మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు జడ్పీటీసీ మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డిలు యువకుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలను కుటుంబ సభ్యులకు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి, బూడిద సైదులు, సునీల్, సాగర్ బాబు, సుమన్, బీర్మిడి రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### హనుమద్వాహనంపై చెన్నకేశవుడు



మాచర్ల రూరల్: శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని హనుమద్వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి రాజగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఊరేగింపును ప్రారంభించారు. శ్రీ ఆంజనేయస్వామి వారు భక్తులందరిలోకి భక్తాగ్రేసుడని, అభయ ప్రదాత అయిన హనుమంతుడు భుజస్కంధముల పై శ్రీలక్ష్మీ నరసింహస్వామి అధిరోహించిన ఉత్సవాన్ని తిలకించి సేవించిన వారందరికీ సద్బుద్ధిని, అభయాన్ని ప్రసాదిస్తారని ఆయన చెప్పారు. ఈఓ ఎం పూర్ణచంద్రరావు నేతృత్వంలో జెఏ వీరారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొమెర అనంతరాములు, బండ్ల బ్రహ్మం, గాజుల గణేష్, కోమటి వీరు, మద్దిగవు శ్రీనివాసరెడ్డి, సుంకె వాసు తదితరులు పాల్గొన్నారు.

### మసీదుకు రూ.25 వేల ఆర్థిక సహాయం



మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో ముస్లిం సోదరులు నూతనంగా నిర్మించిన మసీదులో ఇన్వర్టర్ ఏర్పాటుకుగాను రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ద్వారా వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆదివారం అందజేశారు. మసీదులో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో నమాజ్‌కు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ముస్లిం సోదరులు అశోక్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ఆర్థిక సహాయం అందించినట్లు ముస్లిం సోదరులు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు గుర్రం గురవారెడ్డి, స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

### 23న ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరులో గల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులు విద్యుత్ ప్రభలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ. లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు.

**రొంపిచర్లలో...**

మండలంలోని మాచవరంలో నల్లంత ఆంజనేయస్వామి తిరునాళ్లు సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

# బొప్పాయి పంటకు ఆధరణ కరువు!

- ఒక్కసారిగా పడిపోయిన ధరలు
- మొన్నటి వరకు టన్ను రూ.20 వేలు
- ప్రస్తుతం రూ.4 వేలు



జెట్టిపాలెంలో సాగు చేస్తున్న బొప్పాయి పంట

రెంటచింతల: పల్నాడు ప్రాంతంలో పత్తి, మిర్చి పంటలకు కొన్నేళ్లుగా నష్టాలు వస్తుండటంతో భూమినే నమ్ముకుని జీవిస్తున్న కొందరు రైతులు బొప్పాయి పంట సాగు ఆశాజనకంగా కనిపించడంతో ఆ వైపు దృష్టి సారించారు. ఈ ఏడాది మాచర్ల, గురజాల నియోజకవర్గాల పరిధిలో సుమారు 700 ఎకరాల్లో బొప్పాయి పంటను రైతులు సాగుచేస్తున్నారు. రెంటచింతల, మాచర్ల, దుర్గి, వెల్దుర్తి తదితర మండలాల్లో బొప్పాయి పంట ఎక్కువగా సాగు చేయగా ప్రస్తుతం పంట కోతకు వచ్చే సమయానికి ధర ఢమాల్ అయ్యింది. దీంతో రైతులకు దిక్కు తోచడంలేదు.

**రైతుల ఆశలు ఆవిరి..**

మార్చి ప్రారంభంలో ఢిల్లీ, ముంబాయి, పూణే, కలకత్తా, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు ఎగుమతులు ఉండటంతో ఒక టన్ను ధర కాయ నాణ్యతను బట్టి రూ.20 వేల నుంచి రూ.22 వేలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్చి చివరి నాటికి కూడా టన్ను ధర రూ.17,500 పలికింది. ఏప్రిల్ మొదటి వారంలో టన్ను ధర రూ.10 వేలు ఉండగా నిన్నా మొన్నటి వరకు రూ.4 వేలకు మించి లేకపోవడంతో రైతుల ఆశలు ఆవిరైపోయాయి. ఎకరాకు కౌలు రూ.15 వేలు చొప్పున తీసుకుని సుమారు మరో రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వమే ఆదుకోవాలి..**

లక్షల రూపాయిలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన బొప్పాయి పంటను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఉద్యాన పంటలు ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం బొప్పాయి పంట సాగు చేసే రైతులకు ఒక హెక్టార్ (2.45 ఎకరాలు)కు మొక్కలు కొనుగోలు చేసి నాటు వేసుకునేందుకు రూ.18,394 ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులకు దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రభుత్వమే ముందుకు వచ్చి రైతుల నుంచి నేరుగా బొప్పాయి పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

**రోజురోజుకు తగ్గిపోతున్న ధరలు..**



ప్రస్తుతం రోజురోజుకు బొప్పాయి ధరలు తగ్గిపోతున్నాయి. 8 ఎకరాల్లో పంటను సాగు చేయగా ఇప్పటి వరకు టన్ను రూ.10 వేలు చొప్పున 13 టన్నులు విక్రయించా. సొంతంగా 4 ఎకరాలతో పాటు ఎకరం రూ.15 వేలు చొప్పున మరో 4 ఎకరాలను కౌలుకు తీసుకుని బొప్పాయి సాగు చేశా. ఎకరాకు రూ. 90 వేలు పెట్టుబడి పెట్టా. నాణ్యమైన పంటను కూడా కొనడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదు.

– భీమిరెడ్డి నర్సింహారెడ్డి, కౌలు రైతు, రెంటచింతల

**14 ఎకరాల్లో పంట సాగుచేశా..**



సీజన్ ప్రారంభంలో బొప్పాయి పంటకు మంచి డిమాండ్ ఉండడంతో 14 ఎకరాల్లో బొప్పాయి పంటను సాగుచేశా. ఎకరాకు సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. కొద్దిరోజుల కిందట టన్ను ధర రూ.20 వేలు ఉండగా ప్రస్తుతం పంట కోతకు వచ్చే సమయానికి అడిగేవారు లేరు. ఇప్పుడు డిమాండ్ తగ్గడంతో కొనడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదు.

– శీలం మల్లేశ్వరరావు, రైతు, జెట్టిపాలెం

**పెట్టుబడి కూడా వచ్చేలా లేదు..**



కొద్ది రోజుల వ్యవధిలోనే ధర ఒక్కసారిగా పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేదు. 3 ఎకరాల్లో బొప్పాయి సాగుచేసి రూ.1.80 లక్షలు పెట్టుబడి పెట్టా. ఇప్పటి వరకు 3 టన్నులు మాత్రమే టన్ను రూ.17,500 చొప్పున అమ్మడం జరిగింది. పంట చేతికి వచ్చే సమయానికి దళారులు కరువయ్యారు.

– పులి ఓబుల్‌రెడ్డి, రైతు, రెంటచింతల

## శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ ప్రగతి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

రొంపిచర్ల: ప్రజలు మూఢ నమ్మకాలను పక్కన పెట్టి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ కాలనీలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 'శాస్త్రీయ ఆలోచనలు వాటి ప్రయోజనాలు' అనే అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అన్నారు. దేశంలో సమస్యలు ఉత్పన్నమవుతున్న వేళ వాటి పరిష్కారానికి ఒకటో, రెండో సంస్థలు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. భావసారూప్యంగల అన్ని సంస్థలు కలిసి పని చేస్తేనే పరిష్కారం అవుతాయని తెలిపారు. రాజకీయ పార్టీలు, సామాజిక సేవా సంస్థలు మూస పద్ధతిలో కాకుండా ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రయోజనం కలిగే విధానంలో పనిచేసినప్పుడే ప్రజల మన్ననలు పొందుతాయని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం మేధావి వర్గం పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మూఢ నమ్మకాలు పెచ్చరిల్లుతున్న నేపథ్యంలో జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలు ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. సమాజాన్ని శాస్త్రీయ దృష్టి వైపు మళ్లించాల్సింది పోయి తిరోగమన భావాలను వ్యాప్తి చేయడం దేశానికి క్షేమం కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జ్వరం వచ్చిన ఐదు రోజుల్లోపు డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పారాసిటమాల్ వాడుకుంటే సరిపోతుందని, అప్పటికి తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. సహజ రోగ నిరోధక శక్తి నిలుపుకోవటం కోసం శారీరక శ్రమ, వ్యాయామం, సమతుల ఆహారం ముఖ్యమని తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు రోజుకు రెండు పూటలు ఆహారం తీసుకుంటే చాలని మూడవ పూట తినకుండా ఉంటే ఇన్సులిన్ స్థాయిలు పడిపోవని తెలిపారు. నొప్పులకు ఎక్కువగా బిళ్లలు వాడకూడదని తేలికపాటి వ్యాయామాల ద్వారా నియంత్రించుకోవాలని తెలిపారు. ప్రజలు ఆరోగ్య, ఆర్థిక, సామాజిక, రుగ్మతలు వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా సమస్యలు ఎందుకు వచ్చాయో కనుగొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని వివరించారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సరాసరి స్పెషలిస్ట్ వద్దకు వెళ్లకుండా ముందుగా జనరల్ వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సరికొండ రామకృష్ణంరాజు, శేషం రాజు, మస్తాన్ వలి, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీ వేములయ్య, అమ్మ నేత్ర అవయవదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ చలపతిరావు, చలమారెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



నరసరావుపేట టౌన్: అగ్నిమాపక శాఖ వారోత్సవాలను పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని నరసరావుపేట అగ్నిమాపకశాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు కోరారు. అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ పల్నాడు జిల్లా అధికారి యస్. శ్రీధర్ పర్యవేక్షణలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అగ్నిమాపక వీరులకు నివాళులు అర్పించనున్నట్లు చెప్పారు. హాస్పిటల్స్, అపార్ట్‌మెంట్స్, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లు, ఆర్టీసీ బస్ స్టాండ్, రైల్వే స్టేషన్‌లలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానం నిర్మాణానికి దాతలు రూ.3.5లక్షల విరాళం అందజేశారు. నరసరావుపేటకు చెందిన మార్నెళ్ల శ్రీనివాస్,సౌజన్య దంపతులు రూ..2.5లక్షలు, పెరుమాళ్ల సత్యనారాయణ,ఆదిలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. ఆలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా విరాళాలను దాతలు ఈవో ఎస్.మాధవీలతకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయశర్మ, నండూరి కాశీ కృష్ణ పాల్గొన్నారు.

## స్వర్గ నిలయం ప్రారంభం

వినుకొండ : పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ చుండూరు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయం సమీపంలో స్వర్గ నిలయం (కర్మల సత్రం) ప్రారంభించారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. అనంతరం స్వర్గ నిలయానికి విరాళాలు అందజేసిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెండేల వెంకట పుల్లారావు, గజవల్లి నాగపవన్‌కుమార్, భవనాసి సాంబశివరావు, కంచర్ల భద్రయ్య, పోలా నర్సయ్య పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నరసరావుపేట: అకారణంగా తొలగించిన పారిశుద్ధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. తమకు పూర్తి వేతనాలు చెల్లించాలని, విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని ఆదివారం సందర్శించి వారికి మద్దతు పలికారు. ఆప్కాస్‌లో ఉన్న కార్మికులు తమకు పూర్తి వేతనాలు చెల్లించాలని కోరినందుకు విధుల్లో నుంచి తొలగించడం ఏ మాత్రం సబబుకాదని గోపాలరావు ఖండించారు. వెంటనే పూర్తి వేతనాలతో విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. దీనిపై మున్సిపల్ అధికారుల మొండివైఖరి మంచిది కాదని హితవు పలికారు. కార్మికులకు అన్నీ మున్సిపాల్టీల్లోని కార్మికులు మద్దతు తెలియచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ అహ్మద్ పాల్గొన్నారు.



శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘ నాయకుడు గోపాలరావు

## కత్తవ చెరువును కబ్జాదారుల నుంచి కాపాడండి

పీడీఎం, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని ఆవులు సత్రం ఎదురుగా ఉన్న చెరువును కబ్జాదారులు నుంచి కాపాడాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం ఆ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెరువును పూర్తిస్థాయిలో ఆక్రమించుకునేందుకు కబ్జాదారులు సిద్ధమయ్యారని, కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ ప్రాంత ప్రజలపైనే ఉందని తెలిపారు. డ్రైనేజ్ ద్వారా వచ్చే మురికి నీరు ఇక్కడి నుంచి కిందకు వెళ్లకుండా కబ్జాదారులు అసలు చెరువుకే ఎసరు పెడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన కోరారు. ఆక్రమణలు ప్రభుత్వమే తొలగించి నాలుగు వైపులా కంచే ఏర్పాటుచేసి చెరువును కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. చెరువులోకి వచ్చే ఆవుల సత్రం, స్టేడియం పక్క కాలవ ఆక్రమణలు తొలగించి కాపాడాలని కోరారు.



చెరువును ఆక్రమించేందుకు చదును చేసిన స్థలం

## ధాన్యం కొనుగోలు

నకరికల్లు: ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు పేర్కొన్నారు. మండలంలోని గుండ్లపల్లి, నర్సింగపాడు, త్రిపురాపురం, నకరికల్లు గ్రామాలలో ఆయా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఆదివారం ధాన్యం కొనుగోలు చేశారు. రబీ సీజన్‌కు సంబంధించి ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, 75 కేజీల బస్తా రూ.1,745కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. సాధారణ రకం క్వింటా రూ.2,300కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

## వక్ఫ్ చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలి




అచ్చంపేట: ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన అచ్చంపేటలో ముస్లింలు ఆదివారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఈ బిల్లు మత స్వేచ్ఛకు భంగం కలుగచేస్తుందన్నారు. బీజేపీ పాలనలో మైనార్టీలపై అణచివేత ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమం మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసమని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, షేక్ కమల్ సైదా, షేక్ బీరువాల జాని పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ కృషి అభినందనీయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో రెండు రాష్ట్రాల స్థాయిలో పాటల పోటీలను నిర్వహిస్తూ గాయకులలోని ప్రతిభను వెలికితీస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు వారి కృషి అమూల్యమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. స్థానిక మానుకొండ కల్యాణ మండపంలో హాయిగా పాడుతా రెండు రాష్ట్రాల గాయకుల పోటీలలో బహుమతులు అందజేసి ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు వ్యవస్థాపకుడు చుండూరు వెంకటేశ్వర్లు నేతృత్వంలో గత ఆరు సంవత్సరాల నుంచి పాడుతా హాయిగా అనే పేరుతో పాటల పోటీలు నిర్వహించటం ఎంతో ఉత్సాహాన్ని, గాయకులు లోని ప్రతిభను ప్రోత్సహిస్తుందన్నారు. సమాజానికి కొత్త కొత్త గాయకులను పరిచయం చేయటంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సాంస్కృతిక విభాగం చైర్మన్ డాక్టర్ కమలాసన్ మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా మనమూ పాడుదాం కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం సంక్రాంతికి నిర్వహిస్తున్నామని, 10సంవత్సరాల వయస్సున్న పిల్లల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు ఈ పోటీలో పాల్గొని తమ ప్రతిభను తెలియజేస్తారన్నారు. ఇదే స్ఫూర్తితో వెంకటేశ్వర్లు కార్యక్రమం నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారని అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గెలుపొందిన గాయకులకు వైద్యులు మురళీకృష్ణ, ముటుకుల కమలాసన్, అల్లం కోటిరెడ్డిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా కుర్రి సాయి మార్కొండారెడ్డి, కెవి నర్సరాజులు వ్యవహరించగా పాస్ట్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, చంద్రశేఖర్‌రెడ్డి, అంక ప్రకాష్, బత్తుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం



రెంటచింతల ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో తపస్సుకాలంను పురస్కరించుకొని క్రైస్తవ సహోదరులు ఈత, కొబ్బరి చెట్టు మట్టలను చేబూని మట్టల ఆదివారం(మ్రానికొమ్మల ఆదివారం)ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో విచారణ గురువులు రె.ఫాథర్ ఏరువ లూర్దుమర్రెడ్డి, సహాయ గురువులు అగస్టీన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని మాట్లాడారు. యేసుక్రీస్తు జీవితంలోని చివరి ఘట్టాలను (తపస్సుకాల శ్రమలను) కథోలికులందరూ ఈస్టర్‌కు ముందు ఈ మట్టల ఆదివారంను పవిత్రాదివారంగా భావించి సంపూర్ణ భక్తి విశ్వాసంతో ప్రార్థించాలన్నారు. ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో రె.ఫాస్టర్ డేగల దేవానంద్ భక్తులకు మట్టల ఆదివారం ప్రత్యేకతను వివరించారు. తుమ్మకోట ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో రె.సీహెచ్ అశోక్ ఆధ్వర్యంలో, పాలువాయి, మంచికల్లు, పశర్లపాడు, రెంటాల, జెట్టిపాలెం తదితర గ్రామాలలోని ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక పార్థనలు చేసి మట్టల ప్రత్యేకతను వివరించారు. ఆశీర్వాదించిన తాటి, ఈత మట్టలను భక్తులకు పంపిణీ చేశారు. మట్టలను తీసుకున్న భక్తులు క్రైస్తవ భక్తిగీతాలను ఆలపించారు.

**లూథరన్ చర్చి ఆధ్వర్యంలో...**

మాచర్ల రూరల్: ఏసుక్రీస్తు లోక రక్షకుడుగా జన్మించాడని ఆయన మార్గంలో మనమందరము పయనించి శాంతి స్థాపనకు కృషి చేద్దామని వెస్ట్ సినడ్ బిషప్ చాట్ల ఐజయ్య రాజు అన్నారు. మట్టల ఆదివారం పురస్కరించుకొని క్రీస్తు దేవాలయ నేతృత్వంలో నిర్వహించిన ఊరేగింపులో ఆయన మాట్లాడారు. శాంతి, సహనం తోటి వారిని ప్రేమించే లక్షణాలను ఏసుక్రీస్తులో ఉన్నాయని, వాటినన్నింటిని అలవర్చుకొని ఆయన ఆయన అందించిన సిద్ధాంతాలను పాటిద్దామన్నారు. పట్టణ పురవీధుల్లో మట్టలతో దావీదు కుమారుడు జయము.. యూదుల రాజు జయము అంటూ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని మాట్లాడుతున్న బిషప్ ఐజయ్య

## బీపీ మండల్ కృషి ఎనలేనిది

సత్తెనపల్లి: దేశ రాజకీయలలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఉండాలని వారి అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని బీసీ సంఘాల నాయకులు అన్నారు. బీసీల రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమం బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీవో సెంటర్‌లో ఆదివారం జరిగింది. బీసీ సంఘం నాయకుడు విప్పర్ల కొండలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో బీసీల జీవితాలలో వెలుగులు నింపడానికి కేంద్ర ప్రభుత్వానికి 40 సిఫార్సులు చేసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ అని కొనియాడారు. నాయకులు ప్రత్తిపాటి హరేకృష్ణ, పులహరి బానోజీ, కుమ్మరి దస్తగిరి, చింక అంకమ్మరావు, బెల్లంకొండ వెంకట చెన్నయ్య, ఎర్రగొర్ల శ్రీనివాస్, షేక్ చిన్నషరీఫ్, చింతపల్లి లాజరు, పిల్లుట్ల ఆంజనేయులు, గుత్తికొండ కొండమ్మ, పిక్కిలి శివ, నర్ర కృష్ణ, గుంటూరు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

## హేమేలమ్మ మృతి తీరని లోటు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్త గుజ్జర్లపూడి హేమేలమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. కౌన్సిలర్ గుజ్జర్లపూడి ప్రమీల అత్త హేమేలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం హేమేలమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి డాక్టర్ గజ్జల పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చిలక జైపాల్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, కౌన్సిలర్లు పెద్దింటి గోవిందమ్మ వెంకటేశ్వర్లు, సాగరిక మోజేష్, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి కృపావరం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పెట్రో ధరలు తగ్గించాలని డిమాండ్

క్రోసూరు: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని శివసేన పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ వినోదుల నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి తెలుగు రాష్ట్రాలు గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు.